క్లుప్తంగా

విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ



శాయంపేట : మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రజని తెలిపారు. పాఠశాలలో చదువుకున్న 19 నుంచి 25 సంవత్సరాల్లోపు వారికి 40 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 7995010596 నంబర్‌ను సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

హరికుమార్‌కు డాక్టరేట్



హసన్‌పర్తి : కిట్స్ కళాశాల మెకానికల్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న హరికుమార్ అందెం డాక్టరేట్ అందుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆయనకు డాక్టరేట్‌కు ప్రదానం చేసింది. 'డెవలప్‌మెంట్ ఆఫ్ అల్యూమినియం కాంపోజిట్ ఫోమ్, అనలిటికల్ న్యూమరికల్ అండ్ ఎక్స్ పెరిమెంటల్ క్యారెక్టరయిజేషన్' అనే అంశంపై పరిశోధనలు చేశారు. డాక్టర్ పి.రమేష్ పర్యవేక్షణలో పరిశోధనాత్మక వ్యాసాన్ని సమర్పించారు. ఈసందర్భంగా కిట్స్ కళాశాల చైర్మన్ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి, రిజిస్ట్రార్ కోమల్ రెడ్డి, ఏఓ డాక్టర్ రమేశ్ రెడ్డి, మెకానికల్ విభాగం అధిపతి రాజనరేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ ప్రభాకరాచారి హరికుమార్‌ను ఈ సందర్భంగా అభినందించారు.

డంపింగ్ యార్డును వెంటనే తొలగించండి




● కలెక్టరేట్‌లో కాలనీవాసుల ఫిర్యాదు

మడికొండ : గ్రేటర్ వరంగల్ పరిధి 46వ డివిజన్ మడికొండ–రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న డంపింగ్ యార్డుతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, గాలి, నీరు, కలుషితమవుతోందని సోమవారం అడ్‌హక్ కమిటీ సభ్యులు హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్ సెల్‌లో డీఆర్‌ఓ వైవీ గణేష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ డంపింగ్ యార్డును సందర్శిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సమస్యను ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ సభ్యులు మద్దెల ఎర్రగట్టు స్వామి, కరుణాకర్‌రెడ్డి, వినోద్‌కుమార్, మండల సురేష్,భిక్షపతి, కృష్ణమూర్తి, కిశోర్, పెద్ది సత్యనారాయణ, సాంబరాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నేడు పెన్షనర్ల ప్రత్యేక సమావేశం

కాజీపేట : కాజీపేట పట్టణంలోని రైల్వే కమ్యూనిటీ హాల్‌లో నేడు మంగళవారం ఉదయం 10:30 గంటలకు హెచ్‌ఆర్‌ఎంఎస్ ఈ–పాస్, హెచ్‌ఎంఐఎస్ బోబైల్ భద్రతపై ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సంగమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్, ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్స్ ఫెడరేషన్, ఇతర పెన్షనర్ల సంఘాల సహకారంతో డిజిటల్ లిటరసి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రైల్వే పెన్షనర్లు ప్రత్యేక సమావేశానికి హాజరు కావాలని కోరారు.

స్వాతంత్ర్య సమరయోధుడి కన్నుమూత



ఖిలా వరంగల్ : వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం పెరుకవాడకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు బత్తుల లక్ష్మీనారాయణ (88) అనారోగ్యంతో సోమవారం కన్నుమూశారు. అతడికి భార్య లక్ష్మి, కుమారుడు రమేశ్, కుమార్తె రమ ఉన్నారు. ఆయన మృతి విషయం తెలిసి స్వాతంత్ర్య సమరయోధులు సంఘం ప్రతినిధులతోపాటు స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. లక్ష్మీనారాయణ మృతదేహాన్ని పలువురు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో ఎక్సైజ్ శాఖ రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ దిడ్డి నరేందర్, నాగరాజు, బాసాని శ్రీనివాస్, భాస్కర్, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మామునూరు : వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మామునూరు నుంచి వరంగల్ వైపునకు బైక్‌పై బయల్దేరిన ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని వెంటనే 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మామునూరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

సబ్‌మార్కెట్ యార్డు ప్రారంభమెప్పుడో..?



పూర్తయిన మార్కెట్ సబ్‌మార్కెట్ యార్డు ముఖ ద్వారం



పూర్తయిన మార్కెట్ యార్డు షెడ్లు

- పూర్తయిన నిర్మాణ పనులు
- ప్రారంభించని అధికారులు
- దళారులను ఆశ్రయిస్తున్న రైతులు

వేలేరు : మండలంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల రైతులు పంటను విక్రయించేందుకు వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు తీసుకెళ్లే పరిస్థితి ఉండేది. దీంతో రైతులకు గిట్టుబాటు ధర రాకపోవడంతో పాటు దూర ప్రాంతాలకు వెళ్లి విక్రయిస్తే వచ్చే ఆర్థిక భారంతో అప్పులు తప్పా పైసా కూడా మిగిలేది కాదు. దీంతో అంతదూరం వెళ్లలేక రైతులు పంటలను దళారులకు తక్కువ ధరలకే అమ్ముకునే వారు. ఇక్కడి ప్రాంత రైతులు పడుతున్న ఇబ్బందులను గ్రహించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎనుమాముల మార్కెట్‌కు అనుసంధానంగా రైతుల సౌకర్యం కోసం మండలంలోని షోడాషపల్లి రెవెన్యూ పరిధిలో సూమారు 5 ఎకరాల విస్తీర్ణంలో సబ్ మార్కెట్ యార్డు నిర్మాణానికి 2022 ఏప్రిల్‌లో రూ.1 కోటి 98 లక్షల నిధులతో పనులు ప్రారంభించారు. గడువులోగా పనులు పూర్తి చేయాలని సంబంధిత గుత్తేదారును అధికారులు ఆదేశించారు. పనులు చేపట్టిన గుత్తేదారుకు సకాలంలో చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కొన్ని రోజులు పనులు ఆపేశాడు. ఈ క్రమంలో అధికారుల ఒత్తిడి మేరకు పనులను పూర్తిచేశాడు. మార్కెట్ సబ్‌యార్డును ప్రారంభిస్తే వేలేరు, చిల్పూర్, ధర్మసాగర్, భీమదేవరపల్లి, తరిగొప్పుల మండలాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల రైతులకు ఎంతగానో ఉపయోగపడనుంది. మండలంలోని రైతులు పంటను వరంగల్ మార్కెట్‌కు తీసుకువెళ్లి విక్రయించడం వలన ఆర్థికంగా నష్టపోతున్నామని పలువురు అంటున్నారు. మండలంలో నిర్మించిన మార్కెట్ సబ్ యార్డును ప్రారంభిస్తే రైతులు పండించిన పంటను విక్రయిచేందుకు అంత దూరం తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదని, రవాణా ఖర్చులు కూడా తప్పుతాయని అభిప్రాయపడుతున్నారు. మార్కెట్ యార్డు పనులు పూర్తికావడంతో ప్రారంభించి ఇక్కడే రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసే విధంగా సంబంధిత శాఖ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపాలని రైతులు స్థానికులు కోరుకుంటున్నారు.

దళారులకు అమ్ముకుంటున్నాం



కష్టపడి పండించిన పంటను స్థానికంగా విక్రయించే అవకాశం లేకపోవడంతో దళారులకు విక్రయిస్తున్నాం. వరంగల్ మార్కెట్‌కు తీసుకెళ్లే రవాణా ఖర్చులు, ఇతరాత్రా ఖర్చులు అధికమవుతున్నాయి. దాంతో గ్రామాల్లో ఉండే దళారులకే తక్కువ ధరలకు ధాన్యాన్ని అమ్ముకుంటున్నాం. అధికారులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి మండలంలో నిర్మించిన సబ్ మార్కెట్ యార్డును ప్రారంభిస్తే ఎంతగానో మేలు జరుగుతుంది.

– ఆవునూరి శ్యామ్, రైతు, పీచర

రూ.50వేల రుణ యూనిట్‌కు దరఖాస్తుల స్వీకరణ



జూనియర్ అసిస్టెంట్‌కు దరఖాస్తు అందజేస్తున్న యువకుడు

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతీష్టాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకంలో బీసీ కార్పొరేషన్ ద్వారా లక్ష, రెండు లక్షలు, నాలుగు లక్షలతో పాటు రూ. 50 వేల రుణ యూనిట్ కూడా మంజూరు చేయాలని పలువురు యువకులు కోరారు. ఈ మేరకు సోమవారం 70మంది యువకులు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ వేణుగోపాలస్వామికి రాతపూర్వకంగా వినతిపత్రం అందించారు. ఈ విషయమై ఎంపీడీఓ ఫణిచంద్రను వివరణ కోరగా.. మండలంలో 24 గ్రామ పంచాయతీలకు గాను రూ. 50వేల రూపాయల యూనిట్ మండలానికి 150 మంజూరు కాగా 27 దరఖాస్తులు, ఎస్సీ కార్పొరేషన్ 41 యూనిట్లకు గాను 14 దరఖాస్తులు, ఎస్టీ కార్పొరేషన్‌కు 22 యూనిట్లకు గాను ఒక్క దరఖాస్తు కూడా రాలేదని, ఈబీసీ కార్పొరేషన్‌కు 31 యూనిట్లకు గాను 12 దరఖాస్తులు, ముస్లిం మైనార్టీ కార్పొరేషన్‌కు 2 యూనిట్లు కాగా ఒక దరఖాస్తు మాత్రమే వచ్చిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు 70 మంది యువకుల నంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.

పంటరుణం మాఫీ చేయిస్తానని మోసం

● డీసీఓకు బాధిత రైతు ఫిర్యాదు



డీసీఓకు అందించిన ఫిర్యాదు కాపీని చూపిస్తున్న పృథ్వీరాజ్

శాయంపేట : పంటరుణం మాఫీ చేయించడంతో పాటు రుణం పెంచి ఇప్పిస్తానని రైతు నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన సంఘటన మండల కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత రైతు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన రేణికుంట్ల పృథ్వీరాజ్ గతంలో స్థానిక పీఏసీఎస్ సొసైటీలో పంటరుణం తీసుకోగా 2024లో రూ.59,817 రుణం మాఫీ అయ్యింది. అయితే వడ్డీ డబ్బులు రూ.8,000 పృథ్వీరాజ్ చెల్లించాల్సి ఉంది. ఈ క్రమంలో సంఘం ఇన్‌చార్జ్ కార్యదర్శి మెరుగు శంకర్ కలిసి రూ.10 వేలు ఇస్తే మళ్లీ రుణం పెంచి ఇప్పిస్తానని నమ్మబలికినట్లు బాధిత రైతు తెలిపాడు. దీంతో రూ.8,000 వడ్డీ డబ్బులకు బదులు రూ.10 వేలు చెల్లించానని తెలిపాడు. కానీ శంకర్ రసీదు ఇవ్వలేదన్నాడు. కాగా ఈ ఏడాది రూ.80,000 రుణం మంజూరుకాగా మళ్లీ శంకర్ కలిసి రూ.25,000 ఇస్తే రూ.80,000 రుణాన్ని మళ్లీ లక్షకు పెంచడంతో పాటు మాఫీ చేపిస్తానని నమ్మబలికినట్లు తెలిపాడు. దీంతో శంకర్‌కు రూ.25,000 ముట్టజెప్పానన్నాడు. నెల రోజుల తరువాత లోన్ రెన్యూవల్ కోసం బ్యాంక్ సిబ్బంది ఇంటికి వచ్చారని రైతు పృథ్వీరాజ్ తెలిపాడు. వడ్డీ కట్టి రెన్యూవల్ చేసుకోవాలని సిబ్బంది సూచించగా తాను ఎన్ని డబ్బులు కట్టాలని అడిగానన్నాడు. రూ.89,500 ఉందని బ్యాంక్ సిబ్బంది చెప్పగా ఖంగుతిని తాను శంకర్‌కు చెల్లించానని సిబ్బందికి చెప్పానన్నాడు. వెంటనే పీఏసీఎస్ బ్యాంక్‌కు వెళ్లి శంకర్‌ను ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెప్పాడని, దీంతో మరో రూ.50,000 శంకర్‌కు ఇచ్చి మిగతా డబ్బులు కూడా ఇస్తానని, లోన్ క్లోజ్ చేసి పట్టా పాసుబుక్కు ఇవ్వాలని శంకర్‌ను కోరానని తెలిపాడు. అనంతరం ఆత్మకూరు పీఏసీఎస్ కార్యాలయానికి వెళ్లి బ్యాంక్ స్టేట్‌మెంట్ అడుగగా సదరు సిబ్బంది శంకర్ ఆదేశంలేనిది ఇవ్వమని చెప్పారని వాపోయాడు. వడ్డీ డబ్బులు రూ.8,000, తరువాత ఇచ్చిన రూ.25,000 శంకర్ స్వంతానికి వాడుకున్నాడని బాధిత రైతు ఆరోపించాడు. దీంతో హనుమకొండ డీసీఓ సంజీవరెడ్డికి ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. కాగా తనకు రేణుకుంట్ల పృథ్వీరాజ్ డబ్బులు ఇవ్వలేదని, తనపై అనవసరపు ఆరోపనలు చేస్తున్నాడని శంకర్ తెలిపారు.

భూ కబ్జాదారుడిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

హన్మకొండ అర్బన్: ఐనవోలు మండలం పంథిని గ్రామంలో ఖమ్మం హైవే రోడ్డు పక్కనే ఉన్న సర్వే నంబర్ 322లోని ఎస్సీలకు చెందిన 35 గుంటల ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన విక్రమ్‌రావుపై వెంటనే చర్యలు తీసుకోవాలని బాధితులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులతో కలిసి విక్రమ్‌రావు దళితుల భూములను నకిలీ పట్టాలతో పాస్ బుక్‌లో ఎక్కించారన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ కూడా ఎలాంటి విచారణ చేపడం లేదన్నారు. బాధితులంతా సదరు విక్రమ్‌రావును నిలదీసి అడగడంతో మీకు భూమి ఎక్కడిదని, మీ దిక్కున్న చోట చెప్పుకో అని భయభ్రాంతులకు గురి చేస్తున్నడని తెలిపారు. వెంటనే కలెక్టర్ జోక్యం చేసుకుని అక్రమణకు గురైన భూమిని కాపాడి దళితులకు న్యాయం చేయాలని కోరారు. బాధితులు ఎస్.అఖిల్, రాజశేఖర్, రాజ్‌కుమార్, ప్రసాద్, యశ్వంత్, పూలమ్మ, భద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వరద నీరు తరలించాలని నిరసన



వరంగల్ అర్బన్ : హంటర్ రోడ్డులోని బొంది వాగు నుంచి పోతన నగర్ చర్చి వరకు కచ్చా కాల్వ తీసి, వరద నీరు తరలించాలని ఆయా కాలనీవాసులు బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలోని మేయర్ చాంబర్ ఎదుట సోమవారం నిరసన వ్యక్తంచేశారు. పదేళ్ల నుంచి వరద ముంపుతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని వారు పేర్కొన్నారు. రిటైర్నింగ్ వాల్ కోసం నిధులు మంజూరైన నిర్మాణం చేపట్టకపోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వానాకాలం సమీపిస్తున్నందున ముంపు నుంచి కాపాడాలని కోరారు. ఈ నిరసనలో సాయినగర్, భద్రకాళి నగర్, సంతోషిమాత కాలనీ, బృందావన కాలనీ, ఎన్‌టీఆర్ నగర్ కాలనీలకు చెందిన మందల నర్సింహా రెడ్డి, సిద్ధి రాములు, రాంబాబు, విజయ్, మల్లికార్జున్, శ్రీధర్, శంకర్ సింగ్, శ్రీహరి, రాజ్ కుమార్, కృష్ణ, జలేందర్, చందు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్ బాల్ క్రీడాకారులకు అభినందనలు

వరంగల్ స్పోర్ట్స్ : ఈనెల 29నుంచి జూన్ 2వ తేదీ వరకు చండగఢ్‌లో జరిగే 43వ జాతీయ జూనియర్ సాఫ్ట్ బాల్ జూనియర్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అభినందించారు. ఇటీవల మెదక్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కర్చిన జిల్లా క్రీడాకారులు బాలుర విభాగంలో వి.పవన్‌కుమార్, ఎం.జగదీష్, బాలికల విభాగంలో ఎ.స్ఫూర్తి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ వినయ్‌కుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ పి.సాంబశివరావు, కార్యదర్శి రాజేందర్, ఉపాధ్యక్షుడు పి.సాంబమూర్తి పాల్గొన్నారు.

డీఈఓను సస్పెండ్ చేయాలి

న్యూశాయంపేట : వరంగల్ డీఈఓ నిర్లక్ష్యంతోనే దుగ్గొండి సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకులంలో పదోతరగతి చదివిన విద్యార్థి ఫెయిల్ అయ్యిందని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన డీఈఓను వెంటనే సస్పెండ్ చేయాలని సోమవారం గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణికి విద్యార్థి సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి విద్యార్థికి న్యాయం చేయాలని కోరారు. అలాగే సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా రాజీవ్ యువవికాసం రుణాలు మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు. టీజీవీపీ, ఏబీఎస్ఎఫ్, విద్యార్థి సంఘాల నాయకులు కన్నం సునీల్, మేడ రంజిత్, కాడపాక రాజేందర్, బి.నరేష్, శనిగరపు రాజేందర్‌ప్రసాద్, ఒంటేరు చక్రి తదితరులు పాల్గొన్నారు.

108 సిబ్బంది సేవలు అభినందనీయం

హన్మకొండ అర్బన్ : కొన్నేళ్లుగా ఆయా ప్రాజెక్టుల్లో 108 అత్యవసర సర్వీసుల్లో సేవలందిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది పనితీరు అభినందనీయమని 108, 102, 1962, పార్థీవ వాహనాల ప్రోగ్రాం మేనేజర్ లక్ష్మణ్ పేర్కొన్నారు. జాతీయ పైలట్స్ (డ్రైవర్స్) దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కలెక్టరేట్‌లోని 108 సర్వీసు కార్యాలయంలో ప్రోగ్రాం మేనేజర్ లక్ష్మణ్ కేక్ కట్ చేసి పైలెట్స్‌కు అభినందనలు తెలియజేశారు. ఉద్యోగులు డ్యూటీలో ఉన్నప్పుడు చాలా అప్రమత్తంగా ఉండి క్షతగాత్రులకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఈ సందర్భంగా సూచించారు.

మాజీ జెడ్పీటీసీపై పోలీసులకు ఫిర్యాదు

వర్ధన్నపేట : దుర్భాషలాడుతూ తనపై భౌతిక దాడికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ స్థానిక వర్ధన్నపేట మాజీ జెడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణిపై మండల కేంద్రానికి చెందిన ఈరెల్లి శ్రీనివాస్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. ఈనెల 24న స్థానిక అంబేద్కర్ సెంటర్‌లోని ఇంటర్నెట్ సెంటర్ వద్ద తాను నిల్చుని ఉండగా సారంగపాణి వచ్చి తనను ఇష్టారీతిన దూషించాడని, పిడిగుద్దులతో దాడికి పాల్పడ్డాడని, చంపుతానని బెదిరించాడని తెలిపాడు. సారంగపాణి నుంచి తనకు ప్రాణహాని ఉందని చెప్పారు. పోలీసులు న్యాయం చేయాలని కోరాడు.

భక్తిశ్రద్ధలతో బీరన్న బోనాలు

హసన్‌పర్తి : మండల కేంద్రంలో బీరన్న,కామరాతిస్వామి బోనాల వేడుకలు వైభవంగా జరిగింది. మహిళలు బోనాలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన బోనమెత్తి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పరిశీలకుడు నమిండ్ల శ్రీనివాస్, బీజేపీ క్రమశిక్షణ సంఘం రాష్ట్ర చైర్మన్ ధర్మారావు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, కార్పొరేటర్ శివకుమార్, మాజీ కార్పొరేటర్ జక్కుల శ్రీనివాస్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కిరణ్, దేవస్థాన కమిటీ చైర్మన్ వెంకటస్వామి, వీసం సురేందర్‌రెడ్డి, పిట్టల కుమారస్వామి, చకిలం రాజేశ్వర్‌రావు, రజక సంఘం అధ్యక్షుడు ఉదయ్‌కుమార్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎర్రబెల్లి స్వర్ణ రూ.5,116 విరాళం అందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



పెద్దకోడెపాకలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

శాయంపేట : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య లభిస్తుందని నేరేడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవర్దన్ అన్నారు. మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని పిల్లల తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్య పుస్తకాలు, రుచికరమైన మధ్యాహ్న భోజనం, ఉచిత నోటు పుస్తకాలను అందించనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసే దిశగా ఎన్నో సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మోత్కూరి భాస్కర్, నాయకులు మడికొండ రాజు, కోయడ సతీశ్, ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలకు తావివ్వొద్దు

● ఏఓ గంగాజమున



మాట్లాడుతున్న ఏఓ గంగాజమున

శాయంపేట : మండలంలో నాసిరకం విత్తనాల సరఫరాకు తావివ్వొద్దని ఏఓ గంగాజమున అన్నారు. ఫర్టిలైజర్ షాపుల డీలర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో విత్తన, ఎరువులు, పురుగు మందుల డీలర్లలకు వ్యవసాయ శాఖ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ప్రతి డీలర్ తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, లైస్సెన్ లేకుండా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీలర్ షాపు పేరు, ఇంటి నంబర్, ఇతర వివరాలు పెయింట్‌తో రాయించాలన్నారు. కంపెనీల నుంచి వచ్చే సరుకులను ఇన్వాయిస్ లేనిదే గోదాముల్లో దించుకోవద్దని, బిల్లు, డీసీలు లేనిది స్టాక్ సరఫరా చేయొద్దని అన్నారు. రోజువారి నిల్వల వివరాలు స్టాక్ బోర్డుపై రాయాలని, బ్లాక్ మార్కెట్ చేసి విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎస్సై జక్కుల పరమేశ్, డీలర్లు పాల్గొన్నారు.

'చలో వరంగల్'ను జయప్రదం చేయాలి



కమలాపూర్ : మాట్లాడుతున్న సురేశ్

శాయంపేట/కమలాపూర్/ఆత్మకూరు/ పరకాల / ఆత్మకూరు : (దామెర) : ఈనెల 31వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో వరంగల్ సభకు మేధావులు, విద్యావంతులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి మంద కృష్ణమాదిగకు ఘన స్వాగతం పలకాలని ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు, హనుమకొండ ఇన్‌చార్జ్ రుద్రపోగు సురేశ్ పిలుపునిచ్చారు. సోమవారం శాయంపేట, కమలాపూర్, దామెర, ఆత్మకూరు, పరకాల మండల కేంద్రాల్లో ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. భారత అత్యున్నత పౌర పురస్కారమైన పద్మశ్రీ పురస్కారాన్ని భారత రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకుని వరంగల్ నగరానికి వస్తున్న మంద కృష్ణమాదిగకు ఘన స్వాగతం పలకాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల శ్రేణులు పెద్దెత్తున తరలిరావాలని కోరారు. వరంగల్ కాళోజీ కళా క్షేత్రంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జాతీయ కార్యవర్గ సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, మంద రాజు, దినేశ్, సురేందర్, సదయ్య, మహేశ్, శంకర్, సంతోశ్ పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం 2004–2005 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు పరకాలలోని లలిత హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 20 సంవత్సరాల తర్వాత కలుసుకున్న స్నేహితులు.. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా గ్రూప్ ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, రవీందర్, వినయ్‌కుమార్, వాసుదేవ్, మొగిలి, ఆనంద్, కొమురయ్య, సామెల్, మోహన్‌రెడ్డి, సమ్మయ్య, శ్రీనాథ్ రెడ్డి, భిక్షపతి, ధనుంజయ, కుమారస్వామి, రాములు, రవి, రమేశ్, శంకర్, సాంబమూర్తి, జంపయ్య, అటెండర్ జహీర్, పూర్వ విద్యార్థులు సూర్యప్రకాశ్, తోకల సమ్మిరెడ్డి, రాజేందర్, రమ, స్వప్న పాల్గొన్నారు.

పెచ్చులూడిన భవనాలు



శాయంపేట : పెచ్చులూడిన వరండా స్లాబ్



వేలేరు : పెచ్చులూడిన గ్రామపంచాయతీ భవనం

● తృటిలో తప్పిన ప్రమాదం

శాయంపేట : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వరండా పెచ్చులూడిన సంఘటన సోమవారం చోటుచేసుకొంది. నిత్యం ఎంపీడీఓ కార్యాలయానికి పనుల నిమిత్తం అధికారులు, ప్రజలు వస్తూ వెళ్తూ ఉంటారు. ఈ క్రమంలో వరండా పైనఉన్న స్లాబ్ శిథిలావస్థకు చేరుకుని స్లాబ్ పెచ్చులు ఊడి పడ్డాయి. ఈ సంఘటన జరిగిన సమయంలో అటుగా ఎవరు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇప్పటికైనా అధికారులు చొరవచూపి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా పంచాయతీ భవనం..

వేలేరు : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. సర్పంచ్ గది పైకప్పు పెచ్చులూడిపోయి ఇనుపచువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. అలాగే గోడలు పగళ్లు తేలి ప్రమాదకరంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేపించాలని సిబ్బంది తదితరులు కోరుతున్నారు.